క్లుప్తంగా

కమిషనర్‌ను కలిసిన వడుప్సా నాయకులు



వరంగల్ అర్బన్ : వరంగల్ జిల్లా వడుప్సా ఆధ్వర్యంలో మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను సంఘం ప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వడుప్సా జిల్లా అధ్యక్షుడు అంకటి వీరస్వామి, ప్రధాన కార్యదర్శి బిల్లా రవి, కోశాధికారి ఠాగూర్ జ్ఞానేశ్వర్‌సింగ్, గౌరవాధ్యక్షుడు ఆడెపు శ్యామ్, ప్రతినిధులు కోడెం శ్రీధర్, ఆడెపు వెంకటేశ్వర్లు, నాగపూరి కిరణ్ కుమార్, వన్నాల గోవిందరాజులు, కూచన క్రాంతి కుమార్, మోహన్, రవీందర్, సతీష్ మూర్తి, శరత్‌బాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



వరంగల్: లోకసభ ఎన్నికలను పురస్కరించుకొని మామునూరు డివిజన్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏనుమాముల, బాలాజీనగర్, సుందరయ్య నగర్, ఇందిరమ్మ కాలనీ, ముసలమ్మకుంట, 100 ఫీట్ల రోడ్ తదితర ప్రాంతాల్లో పోలీసులు బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ తిరుపతి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉన్నందున వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడవద్దని సూచించారు. కార్యక్రమంలో సీఐ పులి రమేష్, ఎస్సైలు రాజు, నర్సింహారావు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వామి వారికి ప్రత్యేక పూజలు



మడికొండ: శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో గణపతి, రుద్రహోమాలు నిర్వహించారు. శ్రీరాముడి జన్మనక్షత్రం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కే. శేషభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణశర్మ, మణిశర్మ, సాయిశర్మ, భక్తులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఏసీపీ



కాశిబుగ్గ : గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ కాశిబుగ్గలోని నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(గుడిబడి)లో పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్ష జరుగుతున్న గదులు, పరిసరాలను పరిశీలించి పరీక్ష నిర్వహణపై సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ ఎస్.వెంకటేశ్వరరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీఐ, ఎస్సై ఉన్నారు.

ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మడికొండ: కాజీపేట మండలం మడికొండలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. బుధవారం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ నిగ్గుల సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదురోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. బుధవారం అశ్వవాహనంపై, గురువారం హంస వాహనంపై, శుక్రవారం గరుడవాహనంపై, శనివారం హనుమత్సేవ, ఆదివారం స్వామివారి నాగవెల్లి, బండ్ల తీర్థం, గజవాహనంపై ఊరేగింపు నిర్వహించనున్నట్లు చైర్మన్ తెలిపారు.

అంగన్‌వాడీల్లో సరైన పౌష్టికాహారం

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత



హన్మకొండ: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత

హన్మకొండ: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు కావాల్సిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత అన్నారు. మంగళవారం హనుమకొండ హౌజింగ్ బోర్డు, శాంతినగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలతో పాటు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. పిల్లలకు, తల్లిదండ్రులకు చిరుధాన్యాల ఆవశ్యకతపై వివరించారు. అలాగే బేటి బచావో బేటి పడావో కార్యక్రమంపై తల్లులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం సభ్యురాలు స్వర్ణలత మాట్లాడుతూ మహిళలకు లింగ వివక్షత గురించి వివరించారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి మాట్లాడుతూ మహిళలు గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపుల నుంచి విముక్తి పొందేందుకు సఖి వన్‌స్టాప్ సెంటర్లు వినియోగించుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు సరస్వతి, రమ, సఖి సెంటర్ కేస్ వర్కర్ వినీల, హెల్పర్‌లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాంపూర్‌లో అన్నప్రాసన

మడికొండ: కాజీపేట మండలం రాంపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు అన్నప్రాసన, వంటల కార్యక్రమం నిర్వహించారు. మునిగాల శిరీష్‌కుమార్, మాలతి దంపతులు పాల్గొని వంటలను చేశారు. అనంతరం చిన్నపిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శారద, పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలి



ఖిలావరంగల్ : ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి

ఖిలా వరంగల్: పిల్లలకు బలమైన పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించాలని, ఆరోగ్యవంతమైన జీవనం కోసం వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ రమాదేవి సూచించారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వరంగల్ 33వ డివిజన్ ఎస్ఆర్ఆర్ తోటలో ఉర్సు సెక్టార్ ఐసీడీఎస్ వరంగల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన, గర్భిణుల ఆహ్వాన కార్యక్రమం జరి గింది. ముఖ్యఅతిథిగా రమాదేవి హాజరై అవగాహన ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. రెండేళ్లపిల్లలకు జాగ్రత్తగా తల్లిపాలు ఇవ్వాలని, ఆహారం ఇచ్చేట ప్పుడు సమయపాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు సుకన్య, శారద, మాధవి, జ్యోతి, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన సాధ్యం

● ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



కాంగ్రెస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాపాలన సాధ్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ సర్క్యూట్ హౌజ్ రోడ్‌లోని విశాల్ భవన్‌లో మంగళవారం సుమారు వంద మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు ఒడిదుడుకలు ఎదుర్కొన్నారన్నారు. దశాబ్ద కాలం పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచి మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టిందని, అందుకే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. పార్టీలో చేరిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో తాళ్లపెల్లి రవీందర్, జాన్‌వెస్లీ, చిన్న, శ్యామ్, అరుణ్, మనోహర్, సారయ్య, భిక్షపతి, అ బ్రహం, మహేందర్, ఇజాజ్, నరేష్, మున్నా, రాజు, పున్నం, ప్రసన్న, ప్రశాంత్, జగదీష్, అవినాష్ పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న రైల్వేస్టేషన్ పనులు



జంక్షన్ ఎదుట చురుగ్గా సాగుతున్న పనులు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ ఎదుట సర్క్యులేటింగ్ ఏరియాలో అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయి. కేంద్రం కాజీపేట జంక్షన్‌ను అమృత్ భారత్ స్టేషన్‌గా ప్రకటించి పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు స్టేషన్ ఎదుట వివిధ రకాలైన అభివృద్ధి పనులు ప్రారంభించి చేపట్టారు. సుందరీకరణ పనుల్లో భాగంగా గార్డెనింగ్, ఆటోస్టాండ్, ప్రభుత్వ వాహనాల పార్కింగ్, ప్రయాణికులు స్టేషన్‌లోకి వెళ్లేందుకు మార్గం, స్టేషన్‌లో నుంచి బయటికి వచ్చేందుకు మార్గంతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సర్క్యులేటింగ్ ఏరియాలో ఏర్పాటు చేసిన పాతకాలం నాటి దక్కన్ క్వీన్‌స్టీమ్ రైలుఇంజన్ చుట్టూ ప్రత్యేకమైన సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కొన్ని రోజుల తర్వాత ఇప్పుడు ఉన్న కాజీపేట జంక్షన్ అభివృద్ధి పనుల తర్వాత కాజీపేట జంక్షన్ వరల్డ్ క్లాస్ స్టేషన్‌గా ప్రయాణికులకు దర్శనం ఇవ్వనుందని అధికారులు తెలిపారు.

చరిత్రను వక్రీకరిస్తున్న మతోన్మాదులు



మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూశాయంపేట : వీరోచిత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి మతోన్మాదులు మతం రంగు పులిమి చరిత్రను వక్రీకరిస్తున్నారని సీపీఎం హన్మకొండ జిల్లా కార్యదర్శి బి.చక్రపాణి అన్నారు. మంగళవారం హనుమకొండ సుందరయ్య భవన్‌లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు మహిళా ఉద్యమ నేత మల్లుస్వరాజ్యం రెండో వర్ధంతి సభలో పాల్గొని మాట్లాడారు. జిల్లా కమిటీ సభ్యుడు జి.వెంకట్ అధ్యక్షతన జరిగింది. నాయకులు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చక్రపాణి మాట్లాడుతూ వాస్తవ, అవాస్తవాలు తెలంగాణ ప్రజలందరికి తెలుసునని రానున్న కాలంలో ప్రజావర్గ పోరాటాలు విస్తృతంగా నిర్వహించడమే అమరజీవి మల్లు స్వరాజ్యంకు మనమిచ్చే ఘననివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వాసుదేవరెడ్డి, టి.ఉప్పలయ్య, నాయకులు వీరన్న, సంపత్, భానునాయక్, వెంకటయ్య, రవి, రాజు, లింగమూర్తి, స్వామిదాసు అరుణ, రమ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

హన్మకొండ: ఆర్టీసీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు సీహెచ్.రాంచందర్, కార్యదర్శి ఎల్లయ్య డిమాండ్ చేశారు. ప్రజాతంత్ర హక్కులు ప్రజలకు ఇస్తామని చెబుతున్న ప్రభుత్వం కార్మికులు, కార్మిక సంఘాల ప్రమేయం లేకుండా ఏకపక్షంగా 2017 వేతన సవరణను ప్రకటించడం అన్యాయమని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వీస్ కండీషన్స్, అలవెన్స్‌లు, ఫ్రింజ్ బెనిఫిట్స్, సామాజిక భద్రత పథకాలైన ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ ట్రస్టుల నిర్వహణ నిధులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదని తెలిపారు. పెరిగిన నిత్యావసర ధరలు, ఇతర ఖర్చులు పరిగణలోకి తీసుకుని వేతన సవరణ చేయాలన్నారు. 21 శాతం ప్రకటించడంపై కార్మికులు నిరుత్సాంగా ఉన్నారని, 30 శాతంతో ఫిట్‌మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2013 వేతనసవరణ బాండ్లకు సంబంధించిన ఎరియర్స్ వెంటనే చెల్లించాలని వారు కోరారు. కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ వర్తింపజేయాలని, మాస్టర్ స్కేల్ ఇవ్వడంతో పాటు, ఇంక్రిమెంట్ రేట్ 5 శాతంగా నిర్ణయించాలని, రిటైరైన ఉద్యోగులకు రావాల్సిన ప్రయోజనాలు వెంటనే అందించాలని వారు డిమాండ్ చేశారు.

ప్రజాసేవ చేయడమే క్లబ్ లక్ష్యం



ఆస్పత్రికి వీల్‌చైర్స్ బహూకరిస్తున్న క్లబ్ ప్రతినిధులు

● రోటరీ 3150 గవర్నర్ శంకర్‌రెడ్డి

ఎంజీఎం : ప్రజలకు సేవ చేయడమే రోటరీ క్లబ్ లక్ష్యమని క్లబ్ జిల్లా 3150 గవర్నర్ బుసిరెడ్డి శంకర్ రెడ్డి అన్నారు. మంగళవారం వరంగల్‌లోని సీకేఎం ఆ స్పత్రికి రూ.లక్ష విలువ చేసే ఆరు స్ట్రెచర్స్, ఆరు వీ ల్‌చైర్స్ బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ఆస్పత్రికి వచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బంది పడకుండా వీల్‌చైర్స్ ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మల మాట్లాడుతూ వైద్యశాల అవసరాలను గుర్తించి వీల్‌చైర్స్, స్ట్రెచర్స్ అందించిన రోటరీ క్లబ్ ప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు అన్నం రవీంద్రనాథ్, కార్యదర్శి కెపీఎస్. శిరీష్‌కుమార్, కోశాధికారి గంగోజుల నరేశ్, సభ్యులు మనోహర్, రాజిరెడ్డి, రాంరెడ్డి, సతీష్, విజయ్, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రవీన్‌రావు, శ్రవణ్, మంజుల, బిందు, రమా, లక్ష్మి, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలి



బల్దియా కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వయోవృద్ధుల సంఘాల ప్రతినిధులు

వరంగల్ అర్బన్ : వరంగల్ వరంగల్‌లోని వృద్ధులకు డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేకు వయోవృద్ధుల సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ విద్యారణ్యపురి, ఓరుగల్లు వినియోగదారుల రక్షణ సమితి గోపాలపురం వారు కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధానంగా గోపాలపురంలో శ్మశానవాటిక, గ్రంథాలయ భవన నిర్మాణం ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఫంక్షన్‌హాల్‌లో, ప్రైవేట్, ప్రభుత్వ హాస్టళ్లలో జరుగుతున్న ఆహార వృథాను అరికట్టుట, నీటిని పొదుపుగా వాడుట, విద్యుత్ ఆదాపై చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. బల్దియా ద్వారా అన్ని ఫంక్షన్ హాల్లో, హాస్టళ్లలో స్టిక్కర్లు అంటించాలన్నారు. సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు నరసయ్య, యుగంధర్, సత్యనారాయణ, సాంబయ్య, యాదగిరి, రవీందర్ గౌడ్, కలిసి బల్దియా కమిషనర్‌ను శాలువాతో సన్మానించారు.

ఘనంగా శ్రీనివాసుడి కల్యాణం



కాజీపేట : చైతన్యపురి కాలనీలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి పద్మావతి, గోదాదేవి సమేత శ్రీనివాసుడి కల్యాణ వేడుకలను వేదపండితులు ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పంజాల అశోక్‌కుమార్ గౌడ్, మేజర్ వడ్డెపల్లి నరేందర్‌లు వధూవరులకు నూతన వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను డప్పు, వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి వేదపండితులకు అందజేశారు. భక్తులే వధూవరుల పక్షాన నిలిచి కన్యాదానం చేయించారు. ఆలయ ఆవరణలో ఎదుర్కోళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు వివాహ భోజనం ఏర్పాటు చేశారు.

గుడిసెవాసులకు కనీస సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి

ఖిలా వరంగల్: రామసురేందర్(జక్కలొద్ది) గుడిసెవాసులకు కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. మంగళవారం శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో రామ సందీప్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి నివాసాలు ఏర్పాటు చేసుకున్నా విద్యుత్ సరఫరా, వీధిదీపాలు లేక కాలనీవాసులు చీకట్లో జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జక్కలొద్దిలో 2700 కాలనీవాసులకు కనీస సౌకర్యాలు కల్పిస్తూ, ప్రభుత్వ స్థలాలకు పట్టాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, రేషన్‌షాపు కౌంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో మతతత్వ పార్టీ బీజేపీకి సరైన బుద్ధి చెప్పాలని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్‌మియా, దండు లక్ష్మణ్, ఎలేందర్, యాకాంబ్రాచారి, రాజేందర్, గుజ్జ చందు, అనిల్, రాజు, భరత్, శివ, శ్యామ్, వెంకటేశ్వర్లు, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకోడ్‌ను అంకితభావంతో అమలు చేయాలి



వాహన తనిఖీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ

కాజీపేట: రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో రాజకీయ పార్టీలకతీతంగా సేవలు అందించడానికి పోలీసులు సిద్ధంగా ఉండాలని సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారీ అన్నారు. కాజీపేట డీజిల్‌కాలనీ సమీపంలో ఉన్న వాహన తనిఖీ కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావం కనబర్చాలని ఉద్బోధించారు. తనిఖీల్లో సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్సైలు శివకృష్ణ, లవన్‌కుమార్, సునిల్ కుమార్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న బల్దియా కార్మికుడి మృతి



దేవయ్య(ఫైల్)

వరంగల్ అర్బన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన బల్దియా స్వచ్ఛ ఆటోడ్రైవర్, యజమాని బొట్ల దేవయ్య(45) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వరంగల్ ఎల్‌బీనగర్‌కు చెందిన దేవయ్య 27వ డివిజన్ ఇంటింటా తడి, పొడిచెత్త సేకరిస్తూ సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు తరలిస్తుంటాడు. బల్దియా ప్రజారోగ్యం అధికారుల సూచన మేరకు మేడారం జాతరలో పారిశుద్ధ్య నిర్వహణకు స్వచ్ఛ ఆటోతో వెళ్లి విధులు నిర్వహించాడు. గత నెల 29న రాత్రి తిరుగు పయనమయ్యాడు. ఈ క్రమంలో ములుగు జిల్లా గట్టమ్మ గుడి క్రాసింగ్ వద్ద అతివేగంగా వస్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దేవయ్యతో పాటు మరో కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు వీరిని ములుగు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించి అనంతరం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పక్షం రోజుల పాటు చికిత్స పొందాడు. కడుపులో, తలకు బలమైన గాయాలు కావడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మేయర్ గుండు సుధారాణి హైదరాబాద్‌లోని ఆస్పత్రికి చేరుకొని భౌతికకాయం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. దేవయ్యకు బుధవారం ఉదయం అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు బల్దియా అవుట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు తెలిపారు.

వేతనాలు ఇవ్వడం లేదని ఆందోళన



హసన్‌పర్తి : తమకు వేతనాలు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ మంగళవారం ఉపాధ్యాయులు ఆందోళనకు దిగారు. నగరంలోని ఎర్రగట్టు గుట్ట సమీపంలో ఉన్న అక్షర ప్లానెట్ స్కూల్ ప్రధాన గేట్‌కు ఉపాధ్యాయులు తాళం వేశారు. సుమారు గంటపాటు నిరసన సాగింది. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

స్కూల్ పర్మిషన్‌ను రద్దు చేయాలి



సూపరింటెండెంట్‌కు మెమోరాండం అందజేస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు

కాశోజీ సెంటర్ : వరంగల్ కరీమాబాద్ ఎస్ఆర్ఆర్ తోట ప్రాంతంలోని వాణి విద్యానికేతన్‌లో నాలుగో తరగతి చదువుతున్న కీర్తనను చితకబాదిన సంఘటనపై విచారణ జరిపి విద్యార్థికి న్యాయం చేసి స్కూల్ పర్మిషన్ రద్దు చేయాలని ఐక్య విద్యార్థి సంఘాలు మంగళవారం డీఈఓ కార్యాలయంలో సూపరిండెంటిండెంట్ చక్రవర్తికి మెమోరాండం అందజేశారు. మెమోరాండం అందజేసినవారిలో ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లాదల్లా శరత్, యస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

యువకుడి అదృశ్యం

ఖిలా వరంగల్: ఎంజీఎం ఆస్పత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న ఓ యువకుడు ఈ నెల 21న అదృశ్యమైన సంఘటన వరంగల్ మిల్స్‌పోలీస్ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్టేషన్‌పరిధిలోని ఉర్సు కరీమాబాద్‌లోని యువకుడు నాన్నమ్మ, తాత ఇంట్లో నివాసం ఉంటూ ల్యాబ్‌టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఓ యువతితో కలిసి ఫిబ్రవరి 21న అదృశ్యమయ్యాడు. నెల రోజులుగా తల్లిదండ్రులు అతడి కోసం ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం రాత్రి యువకుడి తండ్రి రేణుకుంట్ల విల్సన్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్

రఘునాథపల్లి: ఎండల తీవ్రత నేపథ్యంలో పంటలపై ప్రభావం పడకుండా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సిబ్బందికి సూ చించారు. మండలంలోని ఖిలాషాపూర్ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశా రు. లాగ్ బుక్, రికార్డులను పరిశీలించి, విద్యుత్ సరఫరాలో సమస్యలున్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు కలుగొద్దని సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఆయన వెంట ఎస్ఈ టి. వేణుమాధవ్, డీఈ లక్ష్మినారాయణరెడ్డి, ఏడీఈ మనోహర్‌రెడ్డి, ఏఈ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ గ్రామంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా, సమస్యలు తదితర అంశాలను అక్కడి అధికారులు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జనగామ ఎస్ఈ వేణుమాధవ్, డీఈలు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాట్లాడుతున్న డాక్టర్ లాలారాణి

కరీమాబాద్ : మారుతున్న పరిస్థితులకనుగుణంగా రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వాతావరణ విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ లీలారాణి సూచించారు. వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో నిర్వహిస్తున్న రైతు సలహా సంఘాల సమావేశంలో మంగళవారం ఆమె మాట్లాడారు. వానాకాలం, యాసంగిలో వాతావరణ అనుకూల, ప్రతికూల పరిస్థితులను తట్టుకునే పంటలను సాగుచేయాలని కోరారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రఘురామిరెడ్డి, డాక్టర్ సుధారాణి, డాక్టర్ ఉమారెడ్డితోపాటు వివిధ విభాగాల శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.